# నిరుపేదల భూములు కాజేసిన చరిత్ర ఏనుగుది


పాత వర్ని గ్రామంలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస రెడ్డి

- కమీషన్లు తీసుకొనే వారు ఏం అభివృద్ధి చేస్తారు..
- బాన్సువాడ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి
- వర్ని మండలంలో విస్తృతంగా ప్రచారం

వర్ని, నవంబరు 16 : నిరుపేదల భూములు కాజేసిన చరిత్ర కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్ రెడ్డిదని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి, రూప్లానాయక్ తండా, సక్రియా నాయక్ తండా, పాత వర్ని, హుమ్నాపూర్, నెహ్రూనగర్, వకీల్ ఫారం, అఫంది ఫారం, శ్రీనగర్ గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నిరుపేదలైన దళితుల భూములను కబ్జాచేసి వారిని ఇబ్బందులపాలు చేసిన ఘనత ఏనుగు రవీందర్ రెడ్డిదని ఆరోపించారు. అభివృద్ధి పనుల్లో కార్యకర్తల వద్ద కూడా 10శాతం కమీషన్ తీసుకుంటాడని, ఎదురు తిరిగిన వారు ఎవరైనా వారిపై కేసులు బనాయించి ఇబ్బందుల పాలు చేస్తాడని అన్నారు. బాన్సువాడ నియోజక వర్గ ప్రజలు తెలివైన వారని.. ఏనుగుకు కనీసం డిపాజిట్ కూడ దక్కకుండా ఓడిస్తారన్నారు. పాత వర్ని గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి పాత వర్ని గ్రామాన్ని కొత్తగా రూపుదిద్దానని అన్నారు. అసైన్డ్ భూములను రెగ్యులర్ చేసి క్రయ విక్రయాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేశానని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి సహకార సంఘం మాజీ చైర్మన్ ముకుంద్‌రావ్ మాట్లాడుతూ ఏనుగు రవీందర్ రెడ్డి డబ్బుకోసం ఎలాంటి నీచానికైనా ఒడిగడతాడని ఆరోపించారు.

కమీషన్ల కోసం సొంత పార్టీ కార్యకర్తలపై కూడా కేసులు బనాయించిన ఘనత ఆయనదని అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా బాన్సువాడలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న పోచారం శ్రీనివాస రెడ్డికి ఓటు వేసి గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వర్ని జడ్పీటీసీ సభ్యుడు బర్దావల్ హరిదాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు కరీం, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, బీఆర్ఎస్ నాయకులు మేక వీర్రాజు, కల్లాలి గిరి, సర్పంచులు మైసం వెంకటేశ్వర్లు, శ్రీనగర్ రాజు, ఎంబడి పద్మా నాగభూషణం, ఉండవల్లి సత్తిబాబు, సంతోష్ కులకర్ణి, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పూజలు చేసి.. ప్రచారం ప్రారంభించి..

## సెంటిమెంట్ అయిన బర్దీపూర్ నుంచి షకీల్ ప్రచారం


బర్దీపూర్‌లోని ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్

బోధన్, నవంబర్ 16: గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారాన్ని బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ గురువారం ప్రారంభించారు. సెంటిమెంట్ ప్రకారం ప్రతీ అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే బోధన్ మండలం బర్దీపూర్ గ్రామం నుంచే ఈ సారి కూడా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా షకీల్ ఇప్పటి వరకు మండల కేంద్రాల్లో రోడ్ షోలు, ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీ కార్యకర్తల సమావేశాలు, బీఆర్ఎస్‌లో చేరికల కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చారు. కాగా, గురువారం నుంచి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని షెడ్యూల్‌లో రూపొందించారు. బర్దీపూర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభం సందర్భంగా ఆ గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే షకీల్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బోధన్, సాలూరా మండలాల అధ్యక్షులు సంజీవ్ కుమార్, గోగినేని నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, ఎంఏ రజాక్, సాలూరా షకీల్, సిర్ప సుదర్శన్, మేడి రవి, రామయ్య, బోధన్ వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, సర్పంచులు సాయా రెడ్డి, గుండారం శంకర్, పవన్, బెజ్జం వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో ప్రగతి.. కాంగ్రెస్, బీజేపీలతో దుర్గతి


డొంకేశ్వర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

- వెలుగుజిలుగుల తెలంగాణకు మళ్లీ చిమ్మచీకట్లు ఎందుకు
- ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి
- జోరుగా ఎన్నికల ప్రచారం
- నీరాజనాలు పలికిన మాయపూర్ బజార్ కొత్తూర్, డొంకేశ్వర్ గ్రామాల ప్రజలు

నందిపేట్, నవంబర్ 16 : బీఆర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యమని, కాంగ్రెస్, బీజేపీలతో దుర్గతి పడుతుందని ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని మాయపూర్, బజార్‌కొత్తూర్, డొంకేశ్వర్ గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని ప్రగతి నివేదికలను ప్రజల ముందుంచి ఇన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇచ్చింది కేసీఆర్.. తెచ్చింది తాను అవునా ? కాదా? అని ప్రజలను అడిగారు. ఇప్పుడున్న వెలుగుజిలుగుల తెలంగాణలో మళ్లీ చిమ్మచీకట్లు ఎందుకని ప్రశ్నించారు. గులాబీ సైనికులు తెలంగాణ రక్షకులు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ భక్షకులని కారు గుర్తుకు ఓటు ప్రశాంత జీవితానికి రూటు అన్నారు. నిజామాబాద్, మాక్లూర్‌కు రోడ్లు నిర్మించానని, ఆర్టీసీ, ఆలూర్, వెల్మల్, నందిపేట్ సహా తొమ్మిదికి పైగా బైపాస్ రోడ్లు వేయించానని తెలిపారు. ఆర్మూర్‌కు 100 పడకల దవాఖాన సాధించి ఆధునిక వైద్యాన్ని గడపగడపకూ చేరువ చేశానని వివరించారు. 5 లక్షల చొప్పున ఇంటింటికీ బీమా కేసీఆర్ ధీమా పథకం అమలు కానున్నదని తెలిపారు. కేసీఆర్ పాలనలోనే మనకు న్యాయం జరుగుతుందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

**డొంకేశ్వర్ మండల ప్రజల చిరకాలవాంఛ**

డొంకేశ్వర్, ఆలూర్ మండలాలు కావాలన్నది ప్రజల చిరకాలవాంఛ అని.. అది నెరవేర్చానని అన్నారు. కొత్త మండలాలు చేయాలని సీఎం కేసీఆర్‌ను అడిగితే.. అవసరమా అని తన మీద కోపడ్డారని గుర్తు చేశారు. అయినప్పటికీ పట్టు వీడలేదన్నారు. చివరకు ఏం కావాలో చూడాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆలూర్, డొంకేశ్వర్ కొత్త మండలాలుగా ఏర్పాటయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా తనకు దైవ సమానులైన కేసీఆర్‌కు డొంకేశ్వర్ ప్రజల తరపున మరోసారి పాదాభివందనం చేస్తున్నానన్నారు. డొంకేశ్వర్ మండలం కావడంతో ఎంపీడీవో, తహసీల్ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయన్నారు. డొంకేశ్వర్ మండల అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడిందని జీవన్‌రెడ్డి అన్నారు.

# కాంగ్రెస్ వస్తే కరెంటు కోతలే..


చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

- పువ్వు,చేతి గుర్తుకు ఓటు వేస్తే అభివృద్ధిని దూరం చేసుకునుడే
- కోటి లింగేశ్వర స్వామి మీద ఒట్టు..రాష్ట్ర నిధులతోనే మెట్ల చిట్టాపూర్ రోడ్డు
- కేంద్ర నిధులని బీజేపీ నాయకులు మాట్లాడడం విడ్డూరం
- చౌట్‌పల్లి, బషీరాబాద్‌లో మంత్రి వేముల ఎన్నికల ప్రచారం

కమ్మర్‌పల్లి, నవంబర్ 16 : కాంగ్రెస్, పార్టీవి వట్టి మాటలు..కరెంటు కోతలేనని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఇక్కడ అధికారంలో ఉన్నప్పుడు గానీ, ఇప్పుడు అధికారంలో ఉన్న కర్ణాటకలో గానీ వ్యవసాయానికి కడుపు నిండా కరెంటు ఇచ్చిన చరిత్ర లేదన్నారు. అలాంటి పార్టీకి ఓటు వేస్తే తెలంగాణలో కరెంటు పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలని కోరారు. రాజ్య సభ సభ్యుడు కే.ఆర్. సురేశ్‌రెడ్డితో కలిసి కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లో గురువారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వ్యవసాయానికి కరెంటు పరంగా ప్రోత్సాహం లేదన్నారు. మన పొరుగునే ఉన్న ఒక వైపు కాంగ్రెస్ అధికాంలో ఉన్న కర్ణాటక, మరో వైపు బీజేపీ అధికారంలో ఉన్న మహారాష్ట్ర ఇందుకు నిదర్శనమన్నారు. కర్ణాటకలో 10 గంటల కరెంటు ఇస్తామని ఓట్లు వేయించుకొని గెలిచిన తర్వాత ఏడు గంటల కరెంటును ఎగ్గొట్టారన్నారు. ఇటు మహారాష్ట్రలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం.రూ.లక్షా 80 వేల డీడీ చెల్లించాలని..కరెంటు బిల్లు కూడా కట్టాలని తెలిపారు. కానీ తెలంగాణలో కనెక్షన్ కోసం రూ.6 వేల డీడీ మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ వ్యవసాయానికి పంట పెట్టుబడిగా ఉల్టా పైసలు ఇస్తూ ఉచితంగా కరెంటు ఇస్తున్నారన్నారు. పని చేయక పోతే ప్రజలు ఓటు వేయకుండా వీపు సాఫ్ చేస్తారనే భయం ఉండాలని, అలాగే పని చేసే వారికి ఓటుతో వెన్ను తడతారన్న భరోసా ఉండాలన్నారు. మూడో సారి పార్టీ అధికారంలోకి రాగానే కొత్త బీడీ పీఎఫ్ వచ్చిన వారికి బీడీ పింఛన్ మంజూరు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మిగిలిన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామన్నారు. రుణ మాఫీపై విపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని అందరికీ మాఫీ బాధ్యత తనది, సురేశ్ రెడ్డిదని భరోసా ఇచ్చారు. చౌట్‌పల్లి గ్రామం తన సొంత గ్రామం లాంటిదని..తన మేనత్తను ఇదే గ్రామానికి ఇచ్చామన్నారు. చౌట్‌పల్లిలో సబ్ స్టేషన్ నిర్మించి రెండు గ్రామాల చిరకల వాంఛ నెరవేర్చానని తెలిపారు.బషీరాబాద్ మాటు కాలువ గండ్లు పడుతున్న చోట సీసీ లైనింగ్ వేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బషీరాబాద్‌లో రెండు పంటలకు హన్మంత్ రెడ్డి ఎత్తిపోతలు, గట్టు పొడిచిన వాగు ప్రాజెక్టు జలాలు సంపూర్ణంగా అందించే బాధ్యత తనదేనన్నారు. రెండు గ్రామాల్లో తాను అందించిన అభివృద్ధి కండ్ల ముందే ఉందని..కారు గుర్తుకు ఓటు వేసి మరో సారి గెలిపిస్తే రెట్టింపు సేవలు అందిస్తానన్నారు. ఎంపీ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహకారంతో ప్రత్యేకంగా మన గ్రామాలకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎంతో అభివృద్ధిని అందించాడని.. మళ్లీ గెలిపించుకొని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. అభివృద్ధి అందించిన ప్రశాంత్ రెడ్డికి మనల్ని ఓటు అడిగే సత్తా ఉందన్నారు. రేవంత్ రెడ్డి తాను వేటాడడానికి వచ్చానంటూ హాస్యాస్పదంగా మాట్లాడుతున్నాడని.. తెలంగాణను సైనికుడి లాగా కాపాడుతున్న కేసీఆర్‌పై ఈగ వాలినా ప్రజలు సహించబోరన్నారు. రేవంత్ తుపాకీ రామన్న లాంటి వేటగాడని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. యాదవులు గొర్రె పిల్లను, గంగ పుత్రులు చేపలను బహూకరించారు.